సాక్షి
రంగారెడ్డి
శనివారం । 19 । అక్టోబర్ । 2024



ప్రతిభను వెలికితీసేందుకే..

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు 'సాక్షి స్పెల్ బీ' దోహదపడుతుందని ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ అన్నారు. 10లో▸



డైరెక్టర్ల సమావేశం

తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం డెరెక్టర్ల సమావేశం జరిగింది. 10లో▸



'స్థానిక' ప్రతినిధులేరీ?

జీహెచ్ఎంసీలోని నాలుగు డివిజన్లకు స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లు లేక నెలలు గడిచిపోతున్నాయి. 10లో▸

షాకింగ్ బిల్స్!


మీటర్ రీడింగ్ నమోదు చేయకుండానే బిల్లుల జారీ



- డోర్‌లాక్ పేరుతో అడ్డగోలు బాదుడు
- బిల్లింగ్ స్టేటస్‌పై రివ్యూల విస్మరణ
- కరెంట్ వాడకపోయినా మినిమం పేరుతో వడ్డన
- ఫిర్యాదులకు స్పందించని శివారు సర్కిళ్ల ఇంజినీర్లు
- లబోదిబోమంటున్న వినియోగదారులు

'మేడ్చల్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ ప్రగతినగర్ సెక్షన్ బాచుపల్లిలోని ఓ అపార్ట్‌మెంటులో విద్యుత్ లైన్‌మన్ మీటర్ రీడింగ్ నమోదు చేయకుండానే డోర్‌లాక్ పేరుతో మినిమం బిల్లు జారీ చేశారు. ఆగస్టులో 5 యూనిట్లకు బిల్లు ఇచ్చారు. సెప్టెంబర్‌లో ఇవ్వలేదు. అక్టోబర్‌లో మాత్రం ఏకంగా రూ.3,667 బిల్లు జారీ చేశారు. సదరు వినియోగదారుడు బాచుపల్లి ఏఈని ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన స్పందించకపోవడంతో బాధితుడు కార్పొరేట్ కార్యాలయంలోని ఉన్నతాధికారులను ఆశ్రయించాల్సి వచ్చింది'.

'హబ్సిగూడ సర్కిల్ కీసర డివిజన్ నారపల్లి సెక్షన్ పరిధిలోని ఓ వినియోగదారుడి ఇంట్లోని విద్యుత్ మీటర్‌కు ఒక నెలలో బిల్ కంజమ్షన్, మరో నెలలో మీటర్ స్టకప్ అని నమోదు చేశారు. ఫలితంగా ఆయన ఇంటి నెలవారీ బిల్లు రూ.2 వేలు దాటింది. ఒకవైపు కరెంట్ వినియోగం జరగలేదంటూనే.. మరోవైపు మినిమం బిల్లు పేరుతో అధిక బిల్లు జారీ చేశారు. కనీసం బిల్ స్టేటస్‌ను కూడా పట్టించుకోలేదు. వినియోగదారుడు ఈ లోపాన్ని గుర్తించి సంబంధిత సెక్షన్ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీస స్పందన కూడా లేదు'.



'అజామాబాద్ డివిజన్‌లోని రామాలయం సెక్షన్ పరిధిలో ఓ వినియోగదారుడి ఇంట్లో కరెంట్ మీటర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. నాలుగు నెలలుగా స్టకప్‌లోనే ఉంది. రీడింగ్ నమోదు కావడంలేదు. వెంటనే ఆ మీటర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆపరేషన్స్ విభాగం డీఈ, ఏడీఈ, ఏఈలు ప్రతి నెలా బిల్‌స్టేటస్‌పై రివ్యూలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఇక్కడి అధికారులు అవేవీ పట్టించుకోకపోవడం, క్షేత్రస్థాయి లైన్‌మెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సదరు వినియోగదారుడు నెలకు రూ.1,500 పైగా బిల్లు చెల్లించాల్సి వస్తోంది'.

ఇలా మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్ల పరిధిలోనే కాదు శివారులోని సరూర్‌నగర్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్ సర్కిళ్లలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. ఆపరేషన్ విభాగంలోని ఇంజినీర్ల నిర్లక్ష్యంతో వినియోగదారులు నష్టపోతున్నారు.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: గ్రేటర్ పరిధిలో 60 లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో 52 లక్షల మంది గృహ వినియోగదారులు, మరో 8 లక్షల మంది వాణిజ్య వినియోగదారులు ఉన్నారు. పారిశ్రామిక, ఇతర కనెక్షన్లు మరో 2 లక్షల వరకు ఉన్నట్లు సమాచారం. వీరి ద్వారా సంస్థకు ప్రతి నెలా రూ.1,600 కోట్ల నుంచి రూ.1,800 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు డిస్కం.. అన్ని డివిజన్ల పరిధిలోనూ రెండు బృందాలను ఏర్పాటు చేసింది. విపత్తుల నిర్వహణ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, సాంకేతిక సమస్యల పునరుద్ధరణ కోసం సెంట్రల్ బ్రేక్ డౌన్ (సీబీడీ) గ్యాంగ్‌ను ఏర్పాటు చేసింది. కొత్త కనెక్షన్ల జారీ, లైన్లకు అంచనాలు రూపొందించడం, మీటర్ రీడింగ్, రెవెన్యూ వసూళ్ల కోసం ఆపరేషన్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో సీబీడీ గ్యాంగ్‌లు చురుగ్గా పని చేస్తున్నాయి.

ఆపరేషన్ విభాగం పనితీరు అధ్వానం

భారీ వర్షాలు, వరదలు, ఈదురు గాలులతో చోటు చేసుకున్న నష్టాలను గంటల వ్యవధిలోనే పునరుద్ధరిస్తున్నాయి. ఆపరేషన్ విభాగంలోని డీఈలు, ఏడీఈలు, ఏఈలు, లైన్‌మెన్లు మాత్రం ఆఫీసు దాటి బయటికి రావడం లేదు. మీటర్ రీడింగ్‌కు ఒక నెలలో రెగ్యులర్ లైన్‌మెన్లు, ఏఈలు, ఏడీఈలు .. మరో నెలలో కాంట్రాక్టు కార్మికులు వెళ్లాల్సి ఉంది. కానీ ప్రతి నెలా కాంట్రాక్ట్ మీటర్ రీడర్లు మినహా ఆపరేషన్ విభాగంలోని జీఎల్ఎంలు, ఏఈలు, ఏడీఈలు మాత్రం రీడింగ్‌కు వెళ్లడం లేదు.

కరెంట్ వాడకపోయినా..

లైన్ల నిర్వహణ, విద్యుత్ చౌర్యం, రెవెన్యూ వసూళ్లపైనే కాదు.. కనీసం మీటర్ స్టేటస్‌పై రివ్యూలు కూడా నిర్వహించడం లేదు. డిస్కంలో కీలకమైన సైబర్ సిటీ, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలోని ఆపరేషన్ విభాగంలోని ఇంజినీర్ల అలసత్వం కారణంగా ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు నష్టపోతున్నారు. కరెంట్ వాడకపోయినా చేతికందుతున్న భారీ బిల్లులను చూసి.. 'అమ్మో విద్యుత్ బిల్లు' అంటూ గుండెలు బాదుకోవాల్సి వస్తోంది.

న్యూస్‌రీల్

నేడు చేవెళ్ల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

హాజరుకానున్న స్పీకర్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు

చేవెళ్ల: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎ.వీరేందర్‌రెడ్డి తెలిపారు. చేవెళ్లలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా జి.పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్‌గా బి.రాములు, పాలకవర్గం సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, జిల్లా అధికారులు, మార్కెట్ కమిటీ అధికారులు హాజరు కానున్నట్లు వివరించారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంగ్లిష్ బోధించడానికి అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.శ్రీపాద శర్వాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీలో కనీసం 55 శాతం మార్కులతో పీజీ డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, ఎన్ఈటీ, ఎస్ఈటీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 19వ తేదీ (శనివారం) సాయంత్రంలోపు ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు అందించాలని ఆమె సూచించారు.

ఏనుగు చెరువు తండాలో పర్యటించిన డీపీఓ



మహేశ్వరం: మండలంలోని పెద్దనాగారం గ్రామ పరిధి ఏనుగు చెరువు తండాలో డీపీఓ సురేష్‌మోహన్ శుక్రవారం పర్యటించారు. తండాలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ తండావాసులు ప్రజాపాలనలో ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించడానికి డీపీఓ స్థానిక అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కంపోస్టు షెడ్‌ను పరిశీలించారు. సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ శైలజ, పంచాయతీ కార్యదర్శి జానయ్య తదితరులు ఉన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లు: ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఫుడ్ కమిషన్ కృషి చేస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆహార పదార్థాలను కల్తి చేసి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుపేదలకు ఆహారభద్రత కార్డుల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన మొత్తంలో రేషన్ సరుకులు అందించాలని సూచించారు. జాతీయ ఆహారభద్రతా చట్టం 2013 ప్రకారం ప్రజలందరికీ నాణ్యమైన ఆహారం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆహార భద్రతాచట్టం అమలులో అలసత్వానికి తావు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఆహార పదార్థాలను కల్తీ చేసి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తే ఎంతటివారైనా సహించేదిలేదన్నారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆయన కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు సక్రమంగా అందించాలన్నారు. ఎక్కడైనా ఆహారపదర్థాలు కల్తీ జరిగితే కమిషన్ దృష్టికి తీసుకువస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

- గ్రూప్–1 పరీక్ష పక్కాగా నిర్వహించాలి
- సంబంధిత అధికారులతో కలెక్టర్ శశాంక సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈ నెల 21 నుంచి 27 వరకు నిర్వహించే పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గ్రూప్స్ పరీక్షకు 8,008 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఇందుకోసం 11 కేంద్రాలను ఎంపిక చేసి, వాటికి రెండు రూట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూట్ ఆఫీసర్లు, రీజినల్ కోఆర్డినేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, లైజన్ అధికారులు తమకు కేటాయించిన విధులు పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు అనుమతించాలని, తరువాత వచ్చే వారిని అనుమతించరాదని సూచించారు. అభ్యర్థుల హాల్‌టికెట్, ఫొటోను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. 40 మంది డిజేబుల్ చాలెంజ్ అభ్యర్థులు పరీక్ష రాయడానికి ఇబ్రహీంపట్నం సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆయా రూట్లలో తగినన్ని బస్సులు నడపాలని ఆర్టీసీ వారికి, పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభ్యున్నతిలో భాగం కావాలి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాబాద్: సమాజ అభ్యున్నతిలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని టీఎస్ఐఐసీ (తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) మేనేజింగ్ డైరెక్టర్ ఈ. విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అమేజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు, చెరువుల పునరుద్ధరణ పనులు బాగున్నాయని కితాబిచ్చారు. మండల పరిధిలోని మాచన్‌పల్లి చెరువుకు మరమ్మతులు, మాచన్‌పల్లి తండాలో అంగన్‌వాడీ కేంద్రం పునర్నిర్మాణం, వాటర్ ప్లాంట్‌ను, సోలార్ స్ట్రీట్‌లైట్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్పొరేట్లు, పరిశ్రమల నాయకులు సమాజ అభ్యున్నతిలో కీలక పాత్ర పోషించడం అభినందనీయమని అన్నారు. తెలంగాణలో జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో అమేజాన్ వెబ్ సర్వీసెస్ చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. అమేజాన్ వెబ్ సర్వీసెస్ ఆసియా పసిఫిక్, మధ్య ప్రాచ్యం, ఆఫ్రికాడేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ షాజీ మాట్లాడుతూ.. మాచన్‌పల్లిలో ఉన్న 65 ఎకరాల చెరువు సామర్థ్యం తగ్గిపోయిందని, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి డీసిల్టింగ్ (చెత్తను తొలగించడం) చేసినట్లు చెప్పారు. ప్రాథమిక పాఠశాల భవనాన్ని పునర్నిర్మించి కొత్త అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. పరిశుభ్రమైన తాగు నీటి కోసం రెండు నీటి శుద్ధీకరణ వ్యవస్థలను ఏర్పాటు చేశామన్నారు. 30 సోలార్ వీధి దీపాలు, గ్రామ కూడలి వద్ద సోలార్ హై-మాస్ట్ లైట్లు వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో టీపీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, అమేజాన్ డేటా సెంటర్ హెడ్ శంకరన్, తాతాజీ, కృష్ణచైతన్య, పార్థసారధి, మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేశ్



షాద్‌నగర్: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గందె సురేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఆర్యవైశ్యసంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జిల్లా ఆర్యవైశ్యసంఘం ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి షాద్‌నగర్ పట్టణం నుంచి సీనియర్ నాయకుడు సరాపు రమేశ్, ఆగీరు రవికుమార్‌గుప్తా, గందె సురేశ్, విశ్రాంత తహసీల్దారు సరాపు జగదీశ్వర్ నామినేషన్లను వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గందె సురేశ్‌ను ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఆయన షాద్‌నగర్ వాసవి క్లబ్ చార్టర్ అధ్యక్షుడిగా, ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శిగా పని చేశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

నగర మేయర్‌తో కమిషనర్ భేటీ





జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.ఇలంబర్తి శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన మేయర్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఇలంబర్తికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. – లక్డీకాపూల్

రైతులకు అండగా ఉంటాం

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి



మహిళా రైతుతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న చిలుక మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రతి రైతుకు అండగా ఉండడంతో పాటు వినియోగదారులకు న్యాయం చేస్తామని.. మార్కెట్లలో దళారీ వ్యవస్థను అరికట్టేందుకు కృషి చేస్తానని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో గల కూరగాయల మార్కెట్‌ను శుక్రవారం పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో కలియతిరుగుతూ రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు, వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సే ధ్యేయమని, మార్కెట్‌కు వచ్చే రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటూ.. వారికి కావాల్సిన సౌకర్యాలు సమకూర్చుతామన్నారు. వినియోగదారులకు ధరలు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. మార్కెట్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని.. దళారీ వ్యవస్థను అరికట్టేలా చూడాలని.. వచ్చిన రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులు, హమాలీలు, మార్కెట్ ఉద్యోగులు కలిసి నూతనంగా ఏర్పాటైన పాలకవర్గాన్ని సన్మానించారు. మార్కెట్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడులు చిలుక నరసింహారెడ్డి యూనియన్ బిల్డింగ్‌లో సమావేశం ఏర్పాటు చేసి పాలకవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర్ చారి, డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, మధుసూదన్‌రావు, మచ్చేందర్, రఘుపతిరెడ్డి, నరసింహ, గణేశ్, నవరాజ్, గోవర్ధన్, అంజయ్య, వెంకట్ గుప్తా, కూరగాయల మార్కెట్ కార్యదర్శి ఎండీ వహీద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గాండ్లగూడెం నుంచి వైస్ చాన్స్‌లర్ వరకు



కర్నాటి ప్రతాప్‌రెడ్డి

యాచారం: కాకతీయ యూనివర్సిటీ వీసీగా శుక్రవారం నియమితులైన కర్నాటి ప్రతాప్‌రెడ్డి మన జిల్లా వాసే. యాచారం అనుబంధ గ్రామమైన గాండ్లగూడెంకు చెందిన కర్నాటి మోహన్‌రెడ్డి, విమలమ్మ కుమారుడైన ప్రతాప్‌రెడ్డికి చిన్నప్పటి నుంచి చదువుతో పాటు వ్యవసాయంపై ఎనలేని మక్కువ ఉండేది. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు యాచారంలో చదవగా.. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు అమ్మమ్మ ఊరైన మాడ్గులలో చదివాడు. ఇంటర్ మలకపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. ఎంఎస్‌ఈపీహెచ్‌డీని ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశాడు. 1989 నుంచి ఉస్మానియా యూనివర్సిటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఏళ్లుగా ఉన్నత పదవుల్లో ఉన్నప్పటికీ యాచారం గ్రామంలోని తన వ్యవసాయ పొలంలో వ్యవసాయంపై ఇష్టం వీడలేదు. వీలు చిక్కినప్పుడల్లా గ్రామానికి వస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతూ పంటల సాగులో కూలీలకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలంలో డ్రాగన్‌ఫ్రూట్ పండిస్తున్నారు. తరచూ యాచారం వచ్చివెళ్తుంటారు. ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీకి వీసీగా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి

ఉన్నతాధికారులతో కమిషనర్ ఇలంబర్తి



సాక్షి, సిటీబ్యూరో: అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. శుక్రవారం ఆయన అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు నిర్వహిస్తున్న పనులు, కార్యక్రమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా ఆయా విభాగాల అధికారులు సమర్థంగా, సమన్వయంతో పని చేయాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నగరవ్యాప్తంగా చెత్త సేకరణ ప్రక్రియ మరింత సమర్థంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా విభాగాల ఉన్నతాధికారులు తమ అనుబంధ శాఖలతో సమీక్షలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, స్నేహ శబరీష్, నళినీ పద్మావతి, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సామ్రాట్ అశోక్, యాదగిరిరావు, అలివేలు మంగతాయారు, సత్యనారాయణ, సరోజ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డీఆర్‌డీఓ శ్రీలత



ఒత్తుల తయారీ కేంద్రం వద్ద మహిళా సమాఖ్య సభ్యులతో డీఆర్‌డీఓ శ్రీలత

నందిగామ: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, పలువురికి ఉపాధి కల్పించాలని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. మండల పరిధిలోని సంఘీగూడలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వడ్డే కవితకు మంజూరైన రూ.5లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఒత్తుల తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కేవలం భర్తల ఆదాయం పై మాత్రమే ఆధారపడకుండా స్వయం శక్తితో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, సీసీ అనురాధ, మండల మహిళా సమాఖ్య సభ్యులు శ్రీనిధి, రజిత, సువర్ణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి గొర్రెలు మృతి


జీవాల కళేబరాలు

మాడ్గుల: పిడుగుపాటుకు 23 గొర్రెలు మృత్తి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి అంతంపేట గ్రామానికి చెందిన రైతు ముచ్చర్ల చిన్న బక్కయ్య తన గొర్లను రోజులాగే శుక్రవారం మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం వర్షం పడుతుండటంతో చెట్టుకింద వాటిని నిలువరించగా.. అదే ప్రాంతంలో పిడుగు పడి జీవాలు మృత్యువాత పడ్డాయని కాపరి తెలిపారు. జీవనాధారమైన గొర్లను కోల్పోయానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

కుప్పకూలి.. ప్రాణాలు విడిచి

మీర్‌పేట: వైన్‌షాపులో మద్యం తాగుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగరాజు కథనం ప్రకారం. వనపర్తి జిల్లా ఆత్మకూర్‌కు చెందిన కేశవరావు (60) కొంత కాలంగా అల్మాస్‌గూడ వినాయకహిల్స్ రోడ్ నెం-2లో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం కేశవరావు తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే ఉంచి టీచర్స్‌కాలనీలోని వైన్స్‌కు వెళ్లాడు. మద్యం తాగుతుండగా కూర్చున్న చోటే కుప్పకూలాడు. డయల్ 100కు సమాచారం అందడంతో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలిపారు. అనంతరం కేశవరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. గుండెనొప్పి రావడంతోనే మృతి చెందాడా.. లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డైరెక్టర్ల సమావేశం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ 79వ బోర్డు డైరెక్టర్ల సమావేశం జరిగింది. బ్యాంకు లావాదేవీలు, రుణాలు, వడ్డీరేట్లు, బకాయిల వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఎండీ గోపి, డైరెక్టర్లు చిట్టి దేవేందర్ రెడ్డి, కంభం శ్రీనివాసరెడ్డి, అడ్డిబోజా రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రమేష్ రెడ్డి, ప్రొఫెషనల్ డైరెక్టర్లు మోహన య్య, శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ రిజిస్ట్రార్ ఉదయ్ కుమార్ (ఐఏఎస్), సీజీఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


సాక్షి స్పెల్ బీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు


సాక్షి స్పెల్ బీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రతిభను వెలికితీసేందుకే సాక్షి స్పెల్ బీ

ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ గోవర్ధన్‌రెడ్డి

కడ్తాల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి 'సాక్షి స్పెల్ బీ' ఎంతగానో దోహద పడుతుందని, ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రగతి హైస్కూల్‌లో శుక్రవారం సాక్షి మీడియా ఆధ్వర్యంలో 'సాక్షి స్పెల్ బీ' 2024 మొదటి రౌండ్ పరీక్ష నిర్వహించారు. కేటగిరీ 1, 2, 3, 4 వారీగా 58 మంది బాలురు, 23 మంది బాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంగ్లిష్‌ను కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకోవాలనే ఉద్దేశంతోనే సాక్షి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. స్పెల్ బీతో విద్యార్థుల మధ్య ఆరోగ్యవంతమైన పోటీ ఏర్పడుతుందని తెలిపారు. కేటగిరీల వారీగా నిర్వహించిన ఎగ్జామ్‌కు విశేష స్పందన లభించిందని, ఇలాంటి పరీక్షల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే అవకాశం కల్పిస్తున్న సాక్షికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జైనస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగర పోలీసుకు మీరే దన్ను

- క్షేత్రస్థాయి సమాచారంపై దృష్టి పెట్టండి
- అనునిత్యం అత్యంత అప్రమత్తంగా ఉండండి
- స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి సిటీ కొత్వాల్ ఉద్బోధ
- టీజీ సీసీసీలో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహణ



సాక్షి, సిటీబ్యూరో: స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) అనేది నగర పోలీసు విభాగానికి కళ్లు, చెవులు వంటిది. ఈ విభాగం సిబ్బంది ఇచ్చే సమాచారం ఆధారంగానే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ అన్నారు. స్పెషల్ బ్రాంచ్ పని తీరుపై ఆయన శుక్రవారం విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇటీవల చోటు చేసుకున్న ఇంగ్లిష్ హౌస్ అకాడెమీ, మెట్రో పోలీస్ హోటల్ ఉదంతాల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది. బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో జరిగిన సమీక్షలో ఎస్బీ చీఫ్ ఎస్.చైతన్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ.. 'ఎస్బీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించడంపై దృష్టి సారించాలి. దీని ఆధారంగానే ఉన్నతాధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారు. ఎస్బీలో విధులంటే కొందరు పనిష్మెంట్‌గా భావిస్తుంటారు. ఆ భావన వీడి అంకిత భావంతో పని చేయండి. ఈ అనుభవం మీ సర్వీసులో ఎంతో ఉపకరిస్తుంది. స్థానికులతో పాటు నాయకులు, పెద్దలతో సత్సంబంధాలు కొనసాగించండి. అప్పుడు ఎప్పటికప్పుడు సమాచారం లభిస్తుంది. అలా అందిన దానిపై నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతాధికారులకు చేరవేయండి. ఆ సమాచారం ఎవరిచ్చారనేది మాత్రం బహిర్గం చేయవద్దు. బయటి ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే కొత్తగా వచ్చే వారిపై నిరంతర నిఘా ఉంచండి. అనుమానితులకు సంబంధించి హోటళ్లు, బస్తీ, కాలనీ వాసుల నుంచి సమాచారం వచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకోండి. సరిహద్దు దేశాల నుంచి నగరానికి వివిధ పనులపై వచ్చే వారు ఎక్కువగా ఉంటారు. వారిపై నిరంతరం నిఘా అవసరం. ఇతర రాష్ట్రాల నుంచి వస్తూ సభలు, సమావేశాలు, క్లాసులు ఏర్పాటు చేసే వారి విషయంలో అప్రత్తంగా ఉండాలి. ఎస్బీలో అధికారులు మారిన వెంటనే సిబ్బంది పనితీరు మారకూడదు. సర్వకాల సర్వావస్థల్లోనూ అప్రమత్తంగా ఉంటూ సమాచారం సేకరించాలి. ప్రతి ప్రాంతంపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఉద్రిక్తతల్ని ముందే గుర్తించి నిరోధించవచ్చు. ఈ విభాగానికి కొత్తగా వచ్చే వారికి ప్రత్యేక శిక్షణ అవసరం. పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో నిజాయితీగా వ్యవహరించండి. అప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుంది' అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వాచ్‌మన్ మృతి


మల్లేశ్ మృతదేహం

యాచారం: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వాచ్‌మన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన తుపాకుల మల్లేశ్ (40) యాచారం మండల పరిధిలోని నందివనపర్తిలో ఉన్న ఓ ప్రవేట్ వెంచర్‌లో కొన్నాళ్లుగా వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వ్యక్తిగత పనిమీద శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో మోటార్‌సైకిల్‌పై నక్కర్తమేడిపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో పిల్లిపల్లి గ్రామ సమీపంలోని మలుపు వద్ద తాడిపర్తి గ్రామం నుంచి ఇబ్రహీంట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

ఏసీబీకి చిక్కిన సెక్షన్ ఆఫీసర్

సాక్షి, సిటీబ్యూరో: పౌర సరఫరాల శాఖలోని కన్సూమర్ ఎఫైర్స్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న విక్రమ్ అలెగ్జాండర్ శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. ఓ వ్యక్తి పెన్షన్ మంజూరు కోసం రూ.15 వేలు డిమాండ్ చేసి, తీసుకుంటూ పట్టుబడ్డారు. నిందితు డిని అరెస్టు చేసిన అధికారులు ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

యువతిపై ప్రేమోన్మాది దాడి

సనత్‌నగర్: తనను ప్రేమించి దూరం పెడుతుందనే అక్కసుతో ఓ యువతిపై ప్రేమోన్మాది బ్లేడ్‌తో దాడి చేసి గాయపర్చిన సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని శ్రీకాళహస్తి సమీపంలోని చోడవరం గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, అదే ప్రాంతానికి చెందిన యువతి (21) నెల్లూరు జిల్లాలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. కళాశాలలోని వేర్వేరు విభాగాల్లో చదువుకున్న వీరు ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయమయ్యారు. ప్రేమలో పడిన వీరు అమీర్‌పేటలో ఐటీ కోర్సుల్లో శిక్షణ పొందడం కోసం నగరానికి వచ్చారు. అమీర్‌పేట సత్యం థియేటర్ సమీపంలోని ఓ సంస్థలో ఇద్దరూ శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల మద్యం, ఇతర వ్యసనాలకు బానిసైన మధుసూదన్‌రెడ్డిని యువతి దూరం పెడుతూ వస్తుంది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. కనకదుర్గా బాయిస్ హాస్టల్‌లో ఉంటున్న మధుసూదన్‌రెడ్డి గురువారం సాయంత్రం ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో నిలబడి ఉన్న యువతిపై బ్లేడ్‌తో దాడికి పాల్పడ్డాడు. సంఘటనలో ఆమె మెడకు గాయమైంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది, నిందితుడిని అక్కడే పట్టుకున్నారు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణిని వేధిస్తున్న యువకుడిపై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్: అర్ధరాత్రి ఇంటి తలుపులు తడుతూ..డోర్ బెల్ కొడుతూ న్యూసెన్స్‌కు పాల్పడమే కాకుండా ఇదేమిటని ప్రశ్నిస్తే కత్తితో పొడుస్తానని బెదిరిస్తున్నాడని ఓ గృహిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు రుషి నాయుడు అనే యువకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..నవోదయ కాలనీలో నివసించే గృహిణి (42) ఇంటి ఎదురుగా నవ్య డిజైనర్ పేరుతో రుషినాయుడు, ఆయన తండ్రి షాపు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా రుషినాయుడు అర్ధరాత్రి ఆమెకు ఫోన్లు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. గత మూడు రోజుల నుంచి గేటు దూకి లోపలికి వెళ్లి డోర్ బెల్ కొడుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున 6 గంటలకు డోర్ బెల్ కొట్టగా బాధితురాలి భర్త తలుపు తీయగా తన వద్ద ఉన్న కత్తితో పొడిచేందుకు యత్నించాడు. అడ్డువచ్చిన బాధితురాలిపై కూడా దాడికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులందరినీ చంపేస్తానని బెదిరించి గోడ దూకి పారిపోయాడు. రుషినాయుడు నుంచి తమకు ప్రాణహాని ఉందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై బీఎన్‌ఎస్ సెక్షన్ 78(2), 79, 351(3) కింద క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజా సంబరాలు' ఘనంగా నిర్వహిస్తాం

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న ప్రజా సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. కేబీఆర్ ప్రొమెనేడ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కేబీఆర్ పార్కు వద్ద మధ్యాహ్నం 12.30 గంటల నుండి ప్రజా సంబరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. హైదరాబాద్ సంప్రదాయ, వారసత్వ సంపద సంరక్షణ, మరుగున పడిపోతున్న కళలకు పునర్జీవం పోయడం, ప్రాంతీయ కళాకారులు, ఔత్సాహికులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కేబీఆర్ ప్రొమెనేడ్‌లో ప్రజలు కుటుంబంతో సహా ఆస్వాదించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, లైవ్ మ్యూజిక్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, ఫన్, అడ్వెంచర్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సంబరాలకు ఉచిత ప్రవేశం ఉందని, ఆర్ట్స్. పెయింటింగ్ పోటీలలో పాల్గొనేవారు మాత్రం తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోలర్ హాకీ జట్టులో మనాల్, సుమేర్

సాక్షి, హైదరాబాద్: జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా నిర్వహించే రోలర్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ జూనియర్ బాలబాలికల జట్టులో హైదరాబాద్‌కు చెందిన మనాల్ సుల్తానా, మొహమ్మద్ సుమేర్ ఎంపికయ్యారు. వనస్థలిపురంలో ఇటీవల నిర్వహించే సెలక్షన్ ట్రయల్స్‌లో వీరిద్దరు రాణించి రాష్ట్ర జట్టులో స్థానాన్ని సంపాదించారు. ఐదోసారి మనాల్, సుమేర్ జాతీయ రోలర్ హాకీ పోటీల్లో పాల్గొనబోతున్నారు. అంబర్‌పేట గోల్నాకలోని సెయింట్ పాల్స్ మోడల్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న మనాల్, సుమేర్ చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్‌లో కోచ్ అబూద్ ఖురేషీ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు కోయంబత్తూరులో డిసెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయి.

మెట్రో లాస్ట్‌మైల్ కనెక్టివిటీకి 'మనయాత్రి'



- క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీలు
- రూ.40 కనిష్ట చార్జీతో సేవలు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో ప్రయాణికులకు 'మన యాత్రి' చివరి మైలు ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. నగరంలోని 57 మెట్రోస్టేషన్‌ల నుంచి ప్రయాణికులు మన యాత్రి క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలను వినియోగించుకోవచ్చు. కేవలం రూ.40 కనిష్ట చార్జీలతో మనయాత్రి సేవలను వినియోగించుకోవచ్చని ఆ సంస్థ సీఈఓ సెల్విన్ తెలిపారు. ప్రయాణికులు మనయాత్రి మొబైల్ యాప్ ద్వారా తమ ప్రయాణానికి అనుగుణంగా ఆటో, క్యాబ్, బైక్‌లను బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. శుక్రవారం టీ- హబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో ఎండీ అండ్ సీఈఓ, ఇతర అధికారులు మన యాత్రి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారవాణా రంగంలో మెట్రోరైల్ అత్యంత వేగవంతమైన, మెరుగైన, నాణ్యమైన ప్రయాణ సదుపాయాన్ని అందజేసే సంస్థగా లక్షలాది మందికి చేరువైందన్నారు. ఈ క్రమంలోనే అతి తక్కువ చార్జీలతో మన యాత్రి ద్వారా లాస్ట్ మైల్ కనెక్టివిటీని కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంటి నుంచి మెట్రో స్టేషన్‌కు చేరుకొనేందుకు, మెట్రో నుంచి గమ్యం చేరేందుకు మనయాత్రిని వినియోగించుకోవచ్చన్నారు. ఇది సీమ్‌లెస్ జర్నీ సదుపాయాన్ని అందజేస్తుందని పేర్కొన్నారు. లక్షలాదిమంది మెట్రో ప్రయాణికులు మరింత వేగంగా లాస్ట్‌మైల్ వరకు తమ ప్రయాణాన్ని కొనసాగించవచ్చని చెప్పారు. పర్యావరణహిత, వేగవంతమైన ప్రయాణ సదుపాయాన్ని అందజేయడంలో మెట్రో ఎప్పుడూ ముందుంటుందన్నారు.

'స్థానిక' ప్రతినిధులేరీ?

- ఖాళీగానే ఆ నాలుగు డివిజన్లు
- కార్పొరేటర్లు లేక ప్రజల ఇక్కట్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లోని నాలుగు డివిజన్లకు (వార్డులకు) స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లు లేక నెలలు గడిచిపోతున్నాయి. ఒక డివిజన్‌లోనైతే కార్పొరేటర్ లేక ఏడాదిన్నర దాటింది. అయినప్పటికీ ఇంకా ఆ డివిజన్లకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందుల పాలవుతున్నారు. చెత్త కుప్పలు, దోమలు, రోడ్లపై గుంతలు, రాత్రిపూట వెలగని వీధి దీపాలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. తమ సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియని దయనీయ పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారు.

ఇద్దరి మృతి.. మరో ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఎన్నిక..

గుడిమల్కాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ (బీజేపీ) గత సంవత్సరం జనవరిలో మృతి చెందారు. ఇప్పటివరకూ ఆ డివిజన్‌కు ఉప ఎన్నిక నిర్వహించలేదు. ఎర్రగడ్డ డివిజన్ కార్పొరేటర్ షాహీన్‌బేగం (ఎంఐఎం) నాలుగు నెలల క్రితం మరణించారు. దానికీ ఉప ఎన్నిక జరగలేదు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో రెండు డివిజన్లు ఖాళీ అయ్యాయి. మెహిదీపట్నం కార్పొరేటర్‌గా ఉన్న మహ్మద్ మాజిద్ హుస్సేన్ నాంపల్లి ఎమ్మెల్యేగా, శాస్త్రిపురం డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న మహ్మద్‌ముబీన్ బహదూర్‌పురా ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో ఆ రెండు చోట్లా పది నెలలుగా స్థానిక కార్పొరేటర్లు లేరు.

నిబంధనల ప్రకారం..

ఏ కారణం చేతనైనా ఒక కార్పొరేటర్ స్థానం ఖాళీ అయితే పాలకమండలి తదుపరి ఎన్నికలకు ఆర్నెల్లలోపు గడువు మాత్రమే ఉంటే ఉప ఎన్నిక నిర్వహించరు. ఆర్నెల్ల కంటే ఎక్కువ సమయం ఉంటే జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 7 మేరకు ఉప ఎన్నిక నిర్వహించాలి. అందుకు గాను డివిజన్ ఖాళీ అయిన 15 రోజుల్లోగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసి సమాచారమివ్వాలి. ఉప ఎన్నిక నిర్వహించాల్సిందిగా కోరాలి. నాలుగు నెలల్లోగా ఎన్నికల సంఘం ఉప ఎన్నిక నిర్వహించాలి. నాలుగు డివిజన్లు ఖాళీ అయిన సందర్భాల్లో ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాసినట్లు జీహెచ్‌ఎంసీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం మాత్రం ఇప్పటి వరకు నాలుగు డివిజన్లకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఖాళీగానే ఉన్నాయి.

కాలం గడుస్తున్నా..

జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు అయిదేళ్లు కాగా.. ఖాళీ అయిన డివిజన్లను భర్తీ చేయకపోవడంతో ఒక స్థానంలో ఇప్పటికే ఏడాదిన్నర దాటిపోయింది. రెండు చోట్ల ఏడాది కావస్తోంది. మరో చోట నాలుగు నెలలు దాటింది. బహుశా.. వచ్చే 2025 చివరిలో లేదా 2026 జనవరిలో తిరిగి పాలకమండలి ఎన్నికలు జరగనున్నాయి. అంటే.. త్వరలో ఉప ఎన్నిక నిర్వహించినా.. కొత్తగా ఎన్నికయ్యే కార్పొరేటర్లకు దాదాపు ఏడాది కాలం మాత్రమే గడువుంటుంది. ఇంకా ఆలస్యం జరిగితే అదీ మిగలదు. ఈ నేపథ్యంలో.. ఖాళీ అయిన డివిజన్లకు ఇప్పటికైనా ఉప ఎన్నికలు నిర్వహిస్తారో.. లేదో వేచి చూడాల్సిందే మరి.

